ప్రజాశక్తి
ఆదివారం 22 సెప్టెంబర్ 2024

షోకాజ్ నోటీసులు జారీ

ప్రజాశక్తి- సాలూరు

మున్సిపల్ ఆర్ఐ కె.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ దేవీ ప్రసాద్, బిల్ కలెక్టర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఇంచార్జి కమిషనర్ రామావాదార్యులు చెప్పారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఈ ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్ ఐ శ్రీనివాసరావు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన దేవీ ప్రసాద్‌లకు నోటీసులు జారీ చేశారు.

ఘనంగా గురజాడ జయంతి

- గురజాడ స్ఫూర్తి అవార్డు ఏర్పాటు చేయాలి : మంత్రి కొండపల్లి
- కవులు, కళాకారులకు సన్మానం

విజయనగరంలో గురజాడ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

గొప్ప సామాజిక స్పృహతో రచనలు చేసిన మహాకవి గురజాడ వెంకట అప్పారావు జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చి, ఆయన గొప్పదనాన్ని నేటి తరానికి తెలియజేయడంతో పాటు ఆయన పేరిట గురజాడ స్ఫూర్తి అవార్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రతి పాఠశాలలో గురజాడ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నవయుగ వైతాళికులు గురజాడ 162వ జయంతి వేడుకలు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. గురజాడ స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జయంతి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయనతో విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంఎల్‌సి పి.సురేష్‌బాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, గురజాడ కుటుంబ సభ్యులు వెంకటేశ్వర ప్రసాద్, ఇందిర, లలిత, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, సాహితీ సంస్థల ప్రముఖులు, కళాకారులు, జిల్లా అధికారులు పాల్గొని గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి గురజాడ కూడలి వద్దకు ప్రదర్శనగా చేరుకొని ప్రముఖులంతా మహాకవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన గురజాడ ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ గురజాడ రచనలు ఇప్పటికే పాఠ్యపుస్తకాల్లో ఉన్నాయని, ఆ మహనీయుని జీవిత చరిత్ర కూడా చేర్చడం ద్వారా విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. గురజాడ రచనలను వెలుగులోకి తెచ్చి, ఆతని గొప్పదనాన్ని వివరించిన ప్రముఖ కవి వెలుగు రామినాయుడికి ఈ సందర్భంగా మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖ కవులు జిఎస్ చలం, చీకటి దివాకర్, గురజాడ కుటుంబీకులు ఇందిర, టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున గురజాడ గొప్పదనాన్ని కొనియాడారు. గురజాడ కుటుంబ సభ్యులు గురజాడ వెంకటేశ్వరప్రసాద్, ఇందిర, లలిత, శేఖర్, ప్రముఖ కవులు, కళాకారులు, వెలుగు రామినాయుడు, జిఎస్ చలం, చీకటి దివాకర్, ఎస్.కె.బాబు, ఈపు విజయకుమార్, శ్రీనుగుంటి జానకి, బి.సూర్యలక్ష్మి, టి.అనిల్‌కుమార్‌లను ఈ సందర్భంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా రమణకుమార్ బృందం ప్రదర్శించిన స్వాగత నృత్యం, గురజాడ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, దేశమును ప్రేమించుమన్నా, మహారాజా సంగీత నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన దేశమంటే మట్టికాదోయ్ సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి.

కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, డిపిఆర్‌ఒ డి.రమేష్, డిటిఒ పిఎన్‌వి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, లోకసత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, టిడిపి జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి.రాజు, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.శివప్రసాదరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి కామేశ్వరరావు, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు కాపుగంటి ప్రకాష్, డాక్టర్ ఎ.గోపాలరావు, సాహితీ ప్రముఖులు జక్కు రామకృష్ణ, కన్యాశుల్కం కళాకారులు సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : గురజాడ అప్పారావు రచనలు సమాజానికి వెలుగు జాడలని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు అన్నారు. శనివారం గురజాడ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిద్దుబాటు నవల సమాజాన్ని మేల్కొలిపిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కోడూరు లక్ష్మి, ఉపాధ్యాయులు మల్లేష్ పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈశ్వర సంజీవనాయుడు ఆధ్వర్యాన మహాకవి గురజాడ162 జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళు అర్పించారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద విగ్రహనిర్మాత గుళ్లపల్లి సంజీవనాయుడు, గుళ్లిపల్లి వెంకట అప్పలనాయుడు, నేతాజీ గ్రంథాలయ యువత గొర్లె శ్రావణ్ కుమార్, నల్ల నవీన్, బొద్దాన వెంకటరమణ, చీకటి శ్రీనివాసరావు, మత్స వాసు, సురగాలి నరేష్, డాక్టర్ మత్స శ్రీనివాస్, కోట గోవిందా, పి.వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: సామాజిక చైతన్యాన్ని, సమాజాన్ని మార్చు, అభివృద్ధి దిశగా నడిపించగలిగే సాహిత్యమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం అన్నారు. కళాశాల తెలుగు విభాగం అధికారి డి.రామయ్య అధ్యక్షతన గురజాడ అప్పారావు జయంతి వేడుకలను కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సాహిత్య పఠన అభిలాష ప్రతి విద్యార్థికి ఉండాలన్నారు. సమాజం లో ఉన్న సమస్యలను కవిత అంశంగా స్వీకరించి కథలు, కవితలు రాయాలని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపల్ డి.రామయ్య మహాకవి రచనలు, కన్యాశుల్కం గురించి విద్యార్థులకు వివరించారు.

గురజాడ రచనలు సజీవం

గురజాడకు నివాళ్లు అర్పిస్తున్న సాహితీవేత్తలు

పార్వతీపురం రూరల్ : మహాకవి గురజాడ అప్పారావు రాసిన రచనలు సమాజంలో సమస్యలు ఉన్నంతకాలం సజీవంగానే ఉంటాయని పలువురు వక్తలు అన్నారు. పార్వతీపురంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రి కూడలిలో గల గురజాడ విగ్రహానికి స్నేహితుల సాహితీ, సాహితీ లహరి సాహిత్య సంస్థలకు చెందిన మంచిపల్లి శ్రీరాములు, గంటేడ గౌరినాయుడు ఆధ్వర్యంలో రచయితలు, కవులు, కళాకారులు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులే' గీతాన్ని ఆలపించారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కౌన్సిలర్లు, టిడిపి నాయకులతో కలిసి ప్రధాన రహదారిలో గల గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్యం నిర్వహించిన సాహితీ సమావేశంలో రచయిత గంటేడ గౌరినాయుడు, కళాశాల ప్రిన్సిపల్ చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు 'గురజాడసాహిత్యం – నేటి అవసరం' అన్న అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. వేదాంత జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన సాహితీ అభిమానులు రచయితలు, కళాకారులు పాల్గొని గురజాడ సాహిత్యంపై గోష్ఠిని నిర్వహించారు. కార్యక్రమంలో రచయితలు సిరికి స్వామి నాయుడు, పక్కి రవీంద్రనాథ్, పాలకొల్లు రామలింగస్వామి, జి.రామకృష్ణ శాంతి, మల్లీపురం జగదీష్, చుక్క పారినాయుడు గంటేడ సోమేశ్ పాల్గొన్నారు.

స్థానిక సత్య హిందీ కళాశాల సమావేశ మందిరంలో. గురజాడ జయంతిని ఘనంగా నిర్వహించారు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు అధ్యక్షత వహించి ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ " గురజాడ ఆధునిక సాహిత్యానికి అడుగుజాడ" అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరావు మాట్లాడుతూ " గురజాడ బాలసాహిత్యానికి ఆద్యుడై మంచి గేయాలను వ్రాసారని , ప్రపంచ స్థాయి చెందిన దేశభక్తి గీతం దేశమంటే మట్టికాదోయ్ వ్రాసారని అన్నారు. విశిష్ట అతిథి , కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు మాట్లాడుతూ "వ్యవహార భాషలో నేటి సాహిత్యం వ్రాస్తున్నారంటే దానికి కారణం గురజాడే అన్నారు. సభా నిర్వహణ ను సంస్కృత పండితులు జెబి తిరుమలాచార్యులు నిర్వహించగా ,ఈ కార్యక్రమంలో కవులు రచయితలు బి. వి. పట్నాయక్ , గుడ్ల అమ్మాజి, డా. మంచిపల్లి గోపీనాథ్, పట్టా నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థుల ఆకలి కేకలు

- వేళకు భోజనం పెట్టడం లేదని ఆందోళన
- కలెక్టర్‌కు తల్లిదండ్రుల ఫిర్యాదు

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లా కేంద్రంలో పట్టణం నడిబొడ్డున ఉన్న కురుపాం ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ఆకలి కేకలు పెట్టారు. సమయానికి తమకు భోజనం అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమ కంటే ముందుగా ఉపాధ్యాయులే తినేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తల్లిదండ్రులతో కలిసి కురుపాం ఏకలవ్య పాఠశాల విద్యార్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల్లేవని, ఫ్యాన్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మెనూ కూడా అమలు చేయడం లేదని చెప్పారు. మిగిలిన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల కంటే ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఎక్కువ మెనూ ఛార్జీలు అమలు చేస్తోందని, ఏకలవ్య పాఠశాల భవనం త్వరగా నిర్మించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ శ్యాం నేరుగా విద్యార్థులు, తల్లిదండ్రుల వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సొంత భవనం నిర్మాణంలో ఉందని, పూర్తికావడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఫ్యాన్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పాఠశాలను తనిఖీ చేసిన పిఒ

పట్టణంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఇఎంఆర్ఎస్)ను శనివారం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాస్తవ తనిఖీ చేశారు.

వంటలను పరిశీలిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

పాఠశాలలో వంట గదులు, విద్యార్థుల డార్మెటరీలు, తరగతి గదులు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో శుభ్రతను ఆరా తీశారు. ఆహార పదార్థాలు కింద వినియోగిస్తున్న కాయగూరల నాణ్యత పట్ల ఆయన ప్రశ్నించారు. విద్యార్థులకు పోషక ఆహారాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పక్కాగా ఉండాలని, జాతీయ స్థాయి పోటీల్లో వారు విజయం సాధించేలా విద్యాభ్యాసన కొనసాగాలని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ఉపాధ్యాయులు స్థానిక భాషను నేర్చుకొని, తద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించి, వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని చెప్పారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య అంశాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో ఉపాధ్యాయులు గ్రహించి వారికి తగిన తర్ఫీదు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన అర్జీలను పిఒ పరిశీలించి వాటిని పరిష్కరిస్తామని అన్నారు. పాఠశాల నిర్వహణ రాజీ పడరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే సుపరిపాలన

సంక్షేమాన్ని ఆపితే సహించేది లేదు : మంత్రి

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజులు పూర్తి చేసుకున్నప్పటికీ పాలనలో వెయ్యి రోజులు ముందడుగు వేశామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కోన పంచాయతీ పరిధిలోని గోపాలపురంలో శనివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల ఎంతో సంక్షోభం నెలకొందని, దాని నుంచి బయటపడుతూనే సంక్షేమాన్ని ప్రజలకు అందించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకే చెల్లిందని ఆమె తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అప్పులను, తప్పులను సరిదిద్దుతూ ముందుకెళ్తున్న సమయంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల విజయవాడ ముంపునకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు.

సంక్షేమాన్ని ఆపితే సర్పంచులైన సహించేది లేదు...

ప్రస్తుతం జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి, పథకాలను అడ్డుకోవాలని ఎవరైనా చూస్తే చివరికి సర్పంచులైన సహించేది లేదని మంత్రి సంధ్యారాణి ఘాటుగా హెచ్చరించారు. మండలంలో వైసిపి నాయకత్వం దుర్మార్గంగా ఆలోచిస్తుందని సభలో టిడిపి అధ్యక్షులు జి.వేణుగోపాలనాయుడు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆమె స్థానిక ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరు అడిగినా ఎంఒయులు వెంటనే ఇవ్వాలని హుకుం జారీ చేశారు. వైసిపి నాయకులకు ఏ అధికారైనా వంత పాడినట్లయితే చూస్తూ ఊరుకోమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సంక్షేమ అందిస్తున్నప్పుడు అడ్డుకోవడానికి మీరెవరని ఆమె నిలదీశారు.

అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తా

తనకు అధిక మెజారిటీ ఇచ్చి గెలిపించిన మండల ప్రజానీకానికి సంక్షేమ పథకాలు అందించడంలోనూ, అభివృద్ధి పథంలో నడిపించడంలోనూ ముందుకు తీసుకుపోతామని ఆమె అన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ పాఠశాలల్లో కాంట్రాక్టు ఉద్యోగాలు, వెంగళరాయసాగర్ పరిధిలోని 15 మంది లస్కర్ల నియామకంలోనూ పారదర్శకంగానే సేవలందించామని తెలిపారు. కార్యక్రమంలో సాలూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డిఎఫ్ఒ ప్రసూన, జనసేన సాలూరు నియోజకవర్గ ఇన్చార్జ్ గేదెల రిషవర్ధన్, మండల టిడిపి సీనియర్ నాయకులు ప్రసాదరావునాయుడు, అరుకు పార్లమెంటు నియోజవకవర్గ వైద్యవిభాగం నాయకులు డాక్టర్ పి.మల్లేశ్వరరావు, తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థాయి టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లను ప్రదర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి, అధికారులు

సదరం పరికరాలు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వైద్యులు ఎఫ్ఆర్ఎస్‌లో అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా కేంద్రాసుపత్రిలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సదరం సర్టిఫికేట్ కోసం ఆసుపత్రికి చాలా దూరం నుంచి వచ్చే రోగులకు వీలైతే భోజనం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇకపై సదరం సర్టిఫికేట్ జారీ, స్లాట్స్ బుక్ చేసుకొనే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆసుపత్రికి సదరం సర్టిఫికేట్ కోసం వచ్చిన రోగులకు చెకప్ అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు తాగు నీరు కొరత లేకుండా ఆసుపత్రిలో ఆర్ఒ వాటర్ ప్లాంటలను నిర్వహించాలన్నారు. జనన, మరణ ధ్రువపత్రాల జారీలో ఎటువంటి తప్పుల్లేకుండా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రిలో డయాగ్నొస్టిక్స్ సర్వీసులన్నీ పని చేసేలా చూసుకోవాలన్నారు. బ్లడ్ బ్యాంక్‌లో అన్ని యూనిట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులతో వారానికి ఒక్కసారి మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. హాస్పిటల్లో అందుబాటులో ఉన్న వనరులతోనే మెరుగైన సేవలందించాలన్నారు. రోగికి పెద్ద సమస్య అయితే తప్ప, చిన్న చిన్న సమస్యలకు వేరే హాస్పిటల్ రిఫర్ చేయకూడదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ఆసుపత్రి చుట్టూ పరిశుభ్రంగా ఉండాలన్నారు. డ్రైనేజీ, శానిటైజేషన్‌లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. మహాప్రస్థానం వాహనము ఈ వారంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. హాట్ వాటర్ ప్లాంట్స్ పనిచేసేలా ఉండాలని, వైద్యులంతా అందుబాటులో ఉండాలని అన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి వాగ్దేవి, పురపాలక సంఘం కమిషనర్ కె శ్రీనివాస్, వివిధ విభాగాల వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

పివిటిజి విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం

కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ రెండో సంవత్సరం చదువుతున్న మండంగి సోనియాకు ఐటిడిఎ నుండి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అందించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇన్చార్జి పిఒ, జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక సమక్షంలో చెక్కును సోనియాకు అందజేశారు. సోనియా కురుపాం మండలం చింతమానుగూడకు గ్రామానికి చెందిన పివిటిజి (సవర) బాలిక. గత ఏడాది నీట్‌లో ర్యాంకు సాధించి రంగరాయ మెడికల్ కళాశాలలో సీటు సంపాదించింది. మొదటి సంవత్సరంలో చేరేందుకు తన ఆర్థిక పరిస్థితిని ఐటిడిఎ పిఒకు తెలపగా, రూ.50 వేలు విడుదల చేశారు. రెండో ఏడాది ఫీజు, ఇతర అవసరాలకు రూ 50 వేలు చెల్లించేందుకు ఐటిడిఎ ఆర్థిక సహాయంగా చెక్కును అందజేశారు. నిపుణులైన వైద్యురాలిగా పేరు సంపాదించి జిల్లాలో పనిచేసి వైద్య సేవలందించాలని కలెక్టర్ అన్నారు.

ఐటిడిఎ పిఒగా బాధ్యతలు చేపట్టిన అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ ఇన్‌ఛార్జి ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక నుంచి బాధ్యతలు స్వీకరించారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. విద్యార్థులతో సహా ఆహారాన్ని స్వీకరించారు. విద్యార్థులతో పంక్తిలో కూర్చుని ప్రార్థన చేసి అనంతరం భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని తీసుకునే ముందు చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడగాలని ఆయన సూచించారు. ఆహారాన్ని వదిలివేయరాదని, చక్కని ఆరోగ్యానికి ఆహారం సహకరిస్తుందని ఆయన చెప్పారు. పౌష్టిక ఆహారం పట్ల అవగాహన పెంచుకోవాలని, పౌష్టికాహారాన్ని ముఖ్యంగా బాలికలు విధిగా తీసుకోవాలని కలెక్టర్ బోధించారు. ఆహార పదార్థాలను వృధా చేయరాదని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను బాగా గ్రహించాలని అందుకు ఏకాగ్రత అవసరమని కలెక్టర్ అన్నారు. పాఠ్యాంశాలలో సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ జి.పగడా లమ్మ, ఎఎంఒ వై శంకర్, ప్రధానో పాధ్యాయులు ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

స్వచ్ఛత హి మాటున

గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు ఎగవేత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత.. ఆరోగ్య మే మహా భాగ్యం. వంటి సూక్తుల ఆధారంగా సామాజిక బాధ్యతను, చైతన్యం పెంచడం, ఆరోగ్యాన్ని పరిరక్షించడం మంచిదే. కానీ, ఈ నినాదాలతో ఆ పనులు చేస్తున్న కార్మికుల వేతనాలు ఎగ్గొట్టడం, వారి సంక్షేమాన్ని పట్టించుకోకపోవడం, ఈ వైఖరిపై నిలదీసిన వారి పట్ల వేధింపులకు పాల్పడడం సరికాదు.

కానీ, ఇటీవల స్వచ్ఛత హి పేరిట కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు జిల్లాలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలు అందుకనుగుణంగానే కనిపిస్తున్నాయి. జిల్లాలోని చాలా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు కార్మికులు (గ్రీన్ అంబాస్‌డర్లు) వందలాదిగా ఉన్నారు. వీరికి కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు ఇవ్వాలి. లేదా పంచాయతీ నిధుల నుంచైనా భరించాలి. తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి జిల్లా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్ల పరిస్థితి దయనీయంగా మారింది. వీరికి చెల్లించేది నెలకు రూ.6వేలు. అదికూడా సక్రమంగా చెల్లించడం లేదు. ప్రస్తుతం జిల్లాలో పంచాయతీలవారీగా పరిశీలిస్తే 4నెలల నుంచి 16నెలలు వరకు వేతన బాకాయిలు ఉన్నాయి. చీపుర్లు, గ్లౌజులు, యూనిఫారాలు వంటివి కూడా ఇవ్వడం లేదని కార్మికులు చెబుతున్నారు. చెత్తసేకరించే బండ్లను కూడా మర్మతులు చేయడం లేదు. చివరికి వారి చేతులు కడుక్కోవడానికి సబ్బులు కూడా ఇవ్వడం లేదట. దీన్నిబట్టి పరిసరాల పరిశుభ్రతపైనా, ప్రజారోగ్యంపైనా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏపాటిదో వేరేగా చెప్పనక్కర్లేదు. ఆర్థిక సంఘం నిధులు సరిగా విడుదల చేయడం లేదని, అరకొరగా ఇచ్చినవి కూడా కార్మికుల వరకూ చేరడం లేదని అర్థమౌతోంది. పరిస్థితి ఇలావుంటే స్వచ్ఛత హి పేరిట గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ఇటీవల పంచాయతీరాజ్ శాఖ పిలుపునిచ్చింది. ఈనెల 17న అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వం సిబ్బంది ఒకటే హడావుడి. చెత్తలు తీయడం, డొంకలు, తుప్పలు తొలగించడం వంటివి అక్కడక్కడ కనిపించాయి. వాస్తవానికి ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలి. ఈలోటును కప్పిపుచ్చుకునేందుకు సామాజిక సేవపేరిట ఇటువంటి కార్యాక్రమాలకు కేంద్రం పిలుపునివ్వడమే తడువుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ చేపట్టింది. దీనిపై ప్రజలనుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెత్తను ఎత్తుతున్న కార్మికులకు శఠగోపం పెట్టి, ఇటువంటి కార్యక్రమాలు చేపడితే సామాజికసేవకు జనం వచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వానికి, పాలకులకు చిత్తశుద్ధి ఉంటే కార్మికులకు వేతనాలు, పెంచడంతోపాటు సకాలంలో చెల్లించి, వారి ఆరోగ్యానికి భద్రత కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. అలాగని సామాజిక సేవాకార్యక్రమాలు చేపట్టడం తప్పని కూడా కాదు. ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి, ప్రజలను సామాజిక సేవచేయాలని కోరడమే ఆశ్చర్యకరమైన అంశం అని జనం వ్యాఖ్యానిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయని, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలకు నిధులు కొదవలేదని అధికారులు చెబుతున్నారు. అదే నిజమైతే ఎన్నో గ్రామాల్లో బ్లీచింగ్ కూడా ఎందుకు జల్లడం లేదు. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇటీవల వర్షాలకు గ్రామాల్లో వ్యాధులు ప్రభలాయి. ఇటువంటి పరిస్థితుల్లో స్వచ్ఛతహహి పేరుతో ఒక్కరోజు హడావుడి వల్ల ఉపయోగమేమీ ఉండబోదని పబ్లిక్ టాక్.

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పేదల ఆకలి తీర్చే వరం అన్న క్యాంటీన్ అని, పేదోడికి కడుపునిండా అన్నం పెట్టడమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమీపాన గల అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు 6 పథకాల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారని అన్నారు. గత ప్రభుత్వం పేదలకు పట్టెడన్నం పెట్టలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అయిదేళ్లు స్వచ్ఛమైన, నిస్పక్షపాతమైన పాలన అందించి ప్రజల మన్ననలను అందుకుంటామని విజయచంద్ర తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. గిరిజనులకు, పేదలకు, ఇతర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి పని మీద వచ్చే వారికి, రిక్షా కార్మికులకు, కులవృత్తి వారి అభ్యున్నతికి జిల్లాలో అన్న క్యాంటీన్లను ప్రభుత్వం పునః ప్రారంభించడం శుభ పరిణామమని అన్నారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్ మేనేజ్మెంట్‌కు, సిబ్బందికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్న క్యాంటీన్ నిర్వహణకు డాక్టర్ యాళ్ల వివేక్ రూ.20 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

24న పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం: జాబ్ మేళా కార్యక్రమాన్ని ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాను ఉదయం 9.30 గంటల నుంచి స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశం మందిరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాబ్ మేళాకు అవంతి ఫీడ్స్, అరబిందో ఫార్మా, జిఎంఆర్ రక్షా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలు హాజరవుతాయన్నారు. అవంతి ఫీడ్స్ లిమిటెడ్ వంద మంది ప్రాసెసింగ్ వర్కర్లను నియమిస్తుందని, ఇందుకు కనీస విద్యార్హత ఏమీ లేదని, 18 నుంచి 35 ఏళ్లు కలిగిన యువతీ యువకులు అర్హులని అన్నారు. ఎర్రవరంలో పనిచేయాల్సి ఉందని, వేతనం రూ.11,500 చెల్లిస్తారని తెలిపారు. అరబిందో ఫార్మా, కంపెనీ ఆంధ్రా, తెలంగాణలో పనిచేసేందుకు 400 అప్రెంటీస్ పోస్టులను భర్తీ చేస్తుందని, ఇందుకు 35 ఏళ్లలోపు గల పురుషులు అర్హులని తెలిపారు. మెకానికల్‌లో డిప్లొమా, బిఎస్‌సి (కెమిస్ట్రీలో) ఉత్తీర్ణ, ఉత్తీర్ణులు కాని వారు కూడా అర్హులన్నారు. వేతనం రూ.13 వేలు నుంచి రూ.16,500 వరకు ఉంటుందన్నారు. జిఎంఆర్ రక్షా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ 40 మంది సెక్యూరిటీ గార్డులను నియమిస్తుందని 10వ తరగతి ఉత్తీర్ణులై 166 సెంటి మీటర్ల కనీస ఎత్తుగల, 19 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు గల పురుషులు అర్హులని తెలిపారు. వేతనం రూ.14 వేలు చెల్లిస్తారన్నారు. ఆసక్తి గల యువత మెగా జాబ్ మేళాలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎంఇఒ నాగభూషణరావు సస్పెన్షన్

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గరుగుబిల్లి ఎంఇఒగా విధులు నిర్వహిస్తూ, జియ్యమ్మవలస ఎఫ్ఎసి బాధ్యతలు నిర్వహిస్తున్న నగిరెడ్డి నాగభూషణరావు సస్పెండ్ అయ్యారు ఈ మేరకు శనివారం విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆర్జెడి కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈయన ప్రవర్తనపై జిల్లా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం చేసిన ఫిర్యాదులపై ఆర్జెడి విజయభాస్కర్ విచారణకు ఆదేశించారు. పాలకొండ డిప్యూటీ డిఇఒ పి. కృష్ణారావు ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. ఆరోపణలు రుజువు కావడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

సంధిగూడలోని ఎఎల్ఒ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సూర్యనారాయణ

సంపూర్ణ చికిత్సతోనే మలేరియా నివారణ

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

సంపూర్ణ చికిత్సతోనే మలేరియాను అదుపులో ఉంచగలమని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. శనివారం ఆయన భద్రగిరి సిహెచ్‌సిని తనిఖీ చేశారు. ల్యాబ్‌లో రికార్డులను పరిశీలించారు. కొన్ని గ్రామాల్లో మలేరియా మళ్లీ తిరగబెట్టడాన్ని గుర్తించామన్నారు. ప్రతి మలేరియా కేసును గుర్తించడం ఎంత ముఖ్యమో అదేవిధంగా మలేరియా నివారణకు చికిత్స పూర్తిస్థాయిలో అందించడం కూడా అంతే ముఖ్యం అన్నారు. సంధిగూడ గ్రామంలో నిర్వహించిన ఎఎల్ఒ కార్యక్రమాన్ని పరిశీలించారు. లార్వా స్థావరాలను ఊరిలో తిరిగి గమనించారు. దోమతెరలను వాడడం ద్వారా మనకి మలేరియా రాకుండా రక్షించుకోవచ్చు అని చెప్పారు. 2020లో దోమతెరలు ప్రభుత్వం పంపిణీ చేసిందని, దీన్ని సంవత్సరాల వరకు వాడవచ్చు అని అన్నారు. మళ్ళీ 2025లో దోమతెరలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్ అప్పల నాయుడు, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసరావు, రాజేష్, సిహెచ్ఒ అమల, ఎఎన్ఎమ్ చామంతి సిబ్బంది పాల్గొన్నారు.

23న గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఈనెల 23న స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరంలో అన్ని రకాల స్పెషలిస్ట్ గల డాక్టర్లు పాల్గొని గ్రీన్ అంబాసిడార్లకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, కావున కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని గ్రీన్ అంబాసిడర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి- సీతానగరం

ప్రతి వాహనదారుడు తప్పక హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేసి, వానదారులకు అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్, లైసెన్సు, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పక ఉండాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భరోసా కల్పించాలని జీడి రైతుల నిరసన

ప్రజాశక్తి కొమరాడ

రెగ్యులర్ ఐటిడిఎ పిఒను నియమించి జీడి రైతులకు భరోసా కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గిరిజన సంఘం, సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో కూనేరు సంతలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సంద్బంగా ఆయన మాట్లాడుతూ జీడి రైతులకు అన్ని విధులా ఆదుకోవాలని అలాగే గిరిజన రైతులకు ఎరువులు, విత్తనాలతో పాటు జీడి తోటల అభివృద్ధికి కావాల్సిన మొక్కల కత్తిరింపు పథకంతో పాటు జీడి పునరుద్ధరణ కార్యక్రమాన్ని వెంటనే కల్పించాలని కోరారు. జీడి ఫ్యాక్టరీని కురుపాం నియోజకవర్గంలో నిర్మించి గిరిజన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చెంబరు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివునినాయుడు, సిఐటియు నాయకులు అప్పారావు, గిరిజన రైతులు రాము, సుబ్బారావు, వెంకట్రావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన తప్పనిసరి

కురుపాం: సాగు పద్ధతులపై వ్యవసాయ సిబ్బందికి తప్పనిసరిగా అవగాహన ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్ అన్నారు. మండలంలోని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పంటల సాగు పద్ధతులు, పొలం పిలుస్తుంది కార్యక్రమం గూర్చి వివరించి తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం కెవికె డెమో యూనిట్లను సందర్శించారు. కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త డాక్టర్ కె.ధ్రువ, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మందుగుండు తయారీదారులపై దాడి

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు సమీపాన మందుగుండ సామాన్లను తయారు చేస్తున్నట్లు పక్కా సమాచారంతో చినమేరంగి ఇంఛార్జి ఎస్ఐ పి అనీష్ తన సిబ్బందితో దాడి చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వీరఘట్టం : మండలంలోని తెట్టంగి గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా మందుగొండ సామాగ్రిని విక్రయిస్తున్న ఇద్దరని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి కళాధర్ తెలిపారు. పోలీసులు జరిపిన ఆకస్మిక దాడుల్లో మందు గుండసామాగ్రి లభ్యమయిందని వీటి విలువ రూ. 16,882 ఉంటుందని ఆయన తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

నదిలో మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దేవరసిర్లం పంపు హౌస్ సమీపంలో సువర్ణముఖి నదిలో శనివారం సాయంత్రం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. ఇటీవల కనిపించకుండా పోయిన గోపాలపురం గ్రామానికి చెందిన శంబంగి గౌరమ్మ (65)గా గుర్తించారు. ఈనెల 9న పొలం పనులకు గోముఖి నది దాటి ఉన్న పంట పోలాలకు వెళ్లింది. అప్పటి నుంటి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంతలోనే సువర్ణముఖి నదిలో లభ్యమైన మృతదేహాన్ని గౌరమ్మదిగా గుర్తించినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి అన్నారు. శనివారం మండలంలో కిచ్చాడ గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి 100 రోజులు పరిపాలలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించి అమలు పరిచిన సంక్షేమ పథకాలు గూర్చి వివరించి మంచి ప్రభుత్వం స్టిక్కర్‌ను అంటించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కె. వెంకట కొండయ్య, టిడిపి నాయకులు రమణమూర్తి, సుఖష్ చంద్ర పండా, బలగ రామకృష్ణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పేదలకు మంచి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే విజయ చంద్ర అన్నారు. పట్టణంలోని కొత్తవలస ఏడో వార్డులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు

కురుపాం: కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

బడే గౌరు నాయుడు, కోలా మధు, కూటమి నాయకులు బార్నాల సీతారాం, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని విక్రమపురంలో ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకట నాయుడు ఆధ్వర్యాన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వంద రోజుల ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు ప్రభుత్వం చేయబోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని ఎల్లంకి, మందిరం, గాజుల వీధుల్లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరాలతో పాటు వంద రోజుల పాలనపై ప్రజల నుండి వచ్చిన వివరాలు తెలుసుకుంటున్నారు. దశమంతపురం, నడుకూరు, కంబర, విక్రంపురం తదితర గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, ఎ.కుమారస్వామి, మాచర్ల అనిల్, గీత, నందీశ్వరరావు, ఎం.వెంకటరమణ, ఎల్.మురళి, వి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ వై.వెంకట రమణ, ఇఒపిఆర్‌డి ఎం.నాగభూషణరావు, ఇఒ ఎం.రవి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీతంపేట మండలంలోని చింతాడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన జరిగింది. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంలో ప్రజలందరికీ ప్రభుత్వం అందించిన ప్రగతిని వివరించారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మొహమ్మద్ గియాజుద్దీన్, చింతాడ సర్పంచి, పలుశాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని 21 సచివాలయాలపరిధిలోని 35 గ్రామపంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం అందజేసిన గోడపత్రికలను ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు,

సీతంపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

కార్యకర్తలు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది దగ్గరుండి అంటించి కార్యక్రమం ఆవశ్యకతను వివరిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు రౌతు వేణుగోపాలనాయుడు తెలిపారు. ఆదివారం గెడ్డలుప్పిలో ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పాల్గొంటారని వారు తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు ఆధ్వర్యాన గుమ్మలక్ష్మీపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంచి ప్రభుత్వం కార్యక్రమంపై ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ముఖ్యమంత్రి చంద్రబాబుబాబు నాయుడు అమలు చేస్తారన్నారు. కేదారిపురం, గోయిపాక, చినగీశాడ, చాపరాయి బిన్నిడి, లక్క గూడ తదితర పంచాయతీల్లో మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, టిడిపి నాయకులు ఎస్.రాజేష్, కె.మన్మధ రావు, కె.కళావతి, దుడ్డుఖల్లు సర్పంచ్ లీలావతి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి తొలి మెట్టు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు శనివారం ఐదోరోజు దిగ్విజయంగా జరిగాయి. మండలంలోని 35గ్రామ పంచాయతీలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సకాలంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అప్లోడ్ చేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తీసుకుని చెత్త సంపద కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సచివాలయ సిబ్బంది గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని అడ్డాపుసిలలో స్వచ్ఛహి సేవా కార్యక్రమాల్లో భాగంగా డిఎల్‌డిఒ రమేష్ రామన్ ఆధ్వర్యంలో గ్రామంలో పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సాలూరు: పారిశుధ్యాన్ని తొలగిస్తున్న కార్మికులు

ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పలుచోట్ల జరుగుతున్న వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రమణమూర్తి, సర్పంచి రాములమ్మ, కార్యదర్శి కీర్తి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక మున్సిపాల్టీలో పరిసరాలు, వార్డుల్లో పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. మురుగు కాలువలను శుభ్రపరచి బ్లీచింగ్ చల్లారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. మలేరియా, డెంగ్యూ, అంటువ్యాధులు రాకుండా వీధుల్లో దోమల మందును స్ప్రే చేశారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని శనివారం ఎంపిడిఒ వై. వెంకటరమణ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్‌లో ఉన్న పలు హోటల్స్‌ను తనిఖీ చేసి అన్ని రకాల వంటలు చేసే నూనెతో మరల నూనె వాడ రాదని నిర్వాహకులకు ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.నాగభూషణరావు, వెలుగు ఎపిఎం బి.శివునినాయుడు, మేజర్ పంచాయతీ ఇఒ ఎం.రవి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఎన్‌ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో వున్న సచివాలయం ఎఎన్‌ఎంలపై పని ఒత్తిడి పెరుగుతోందని, లక్ష్యాలను తగ్గించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి.ఇందిర డిమాండ్ చేశారు. శనివారం ఇందిర ఆధ్వర్యాన ఎఎన్‌ఎంలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయపార్వతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఎన్‌ఎంలకు సచివాలయం అధికారులు టీంల్లో వేస్తున్నారని, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారులు కూడా లక్ష్యాలు నిర్దేశిస్తున్నారని చెప్పారు. దీని వల్ల పని ఒత్తిడి పెరిగి మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏదో ఒక శాఖ నియంత్రణలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-3 ఎఎన్‌ఎంల సంఘం అధ్యక్షులు బి.రమాదేవి, సభ్యులు రమణమ్మ, గౌరీశ్వరి పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని అందిస్తున్న ఎఎన్‌ఎంలు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సబ్ డివిజనల్ అధికారి అంకిత సురాని

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రతి ఒక్కరికీ సైబర్ నేరాలపై అప్రమత్తతతో పాటు అవగాహన కలిగి ఉండాలని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అంకిత సురాని అన్నారు. పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్, మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఫేక్ లోన్ యాప్‌ల ద్వారా, సామాజిక మాధ్యమాల్లో లింక్‌లను పంపి ఇన్వెస్ట్మెంట్ చేయాలని నమ్మించడం, ఆన్లైన్లో జాబ్స్ ద్వారా, వర్క్ ఫ్రం హెూం అంటూ ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చంటూ వివిధ రకాలుగా మోసగించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. కావున జాగ్రత్తగా ఉండి మీ చుట్టుపక్కల వారిని కూడా జాగ్రత్తపరచాలని సూచించారు. అత్యాశకు వెళ్లి మోసపోవద్దని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని, వాటివల్ల జీవితం నాశనమవుతుందని తెలిపారు. కావున, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలని, అలాగే మీ చుట్టుపక్కల తెలిసిన వ్యక్తులు గాని, స్నేహితులు గాని ఎవరైనా మత్తుపదర్థాలకు బానిసైనట్టు తెలిసినా, రవాణా, అమ్మకం, వినియోగం గురించి ఎటువంటి సమాచారం వున్నా దగ్గరలో వున్న పోలీస్ స్టేషన్లో గానీ, 1972కు, 100కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సిఐ వి.నారాయణ రావు, కళాశాల ప్రిన్సిపల్ మణికుమార్, ఎఐఎస్ఎఫ్ నాయకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ డివిజనల్ అధికారి అంకిత సురాని

ఐకమత్యంతో పని చేద్దాం : ఎంపిపి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

పార్టీలకతీతంగా ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా అందరం కలిసి పని చేస్తేనే మండలం అభివృద్ధి వైపు నడుస్తుందని ఎంపిపి బొంగు సురేష్ అన్నారు. శనివారం ఎంపిడిఒ శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గతంలో ఎన్నడూ జరిగిన విధంగా వైసిపి, టిడిపి సర్పంచ్, ఎంపిటిసిలతో పాటు అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావడం గమనార్హం. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఎంపిపి సమాధానమిస్తూ అందరిని సంతృప్తి పరిచారు. వైస్ ఎంపిపి సంపత్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ సీజన్‌లో రైతులకు కావలసిన ఎరువులను సకాలంలో వ్యవసాయ శాఖ అందించడం లేదని మండిపడ్డారు. అనంతరం జెడ్‌పిటిసి శశికళ మాట్లాడుతూ వెలుగు ఆధ్వర్యంలో పనిచేస్తున్న విఒఎలు కొంతమందిని అన్యాయంగా తొలగించడం సరైంది కాదని ఏ ప్రాతి పదికన వారిని తొలగించారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ విషయంలో సంబంధిత విఒఎ ఎంపిక, తొలగింపులు ఆయా గ్రామ సంఘాలతో స్థానికంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి అభిప్రాయాన్ని తీసుకొని అధికారులు పనిచేయాలన్నారు. మండలంలో అభివృద్ధి విషయంలో కేవలం సర్వసభ్య సమావేశంతో పాటు ప్రతి నెలలో మొదటి శనివారం ఆఖరు శనివారం రెండు రోజులు పాటు ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలను చర్చించాలని, సమస్యలను పరిష్కరించే వేదికగా ఈ సమావేశాలు ఉపయోగపడాలని ఎంపిపి సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సీతారామయ్య, అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి బొంగు సురేష్

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కొమరాడ

కురుపాంలో జరిగిన నియోజకవర్గ స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ పోటీల్లో స్థానిక కొమరాడ ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వీరికి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డి.లక్ష్మణరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చదువుతో పాటు విద్యా రంగాల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. అండర్-17 విభాగంలో సిహెచ్. రోహిత్ 1500మీటర్లు, 800 మీటర్లు, కె.పవన్ 1500 మీటర్లు, 800మీటర్లు, కె. అభిషేక్-జావెలిన్ త్రో, పి.ప్రభుకుమార్-లాంగ్ జంప్, పి.భరత్ - ఖోఖో, ఎం.జిల్లు వాలీబాల్‌లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. అలాగే అండర్-14 విభాగంలో జి.స్రవంతి (వాలీబాల్), బి.రోహిత్ (ఖో-ఖో)లో ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జిల్లా స్థాయిలో జరగనున్న ఈ క్రీడా పోటీల్లో తమ పాఠశాల నుంచి విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చడం పాఠశాలలతో పాటు ఉపాధ్యాయులకు విద్యార్థులు తల్లిదండ్రులకు మంచి పేరు రావడం చాలా సంతోషమన్నారు. నియోజవర్గ స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన తెలిపి జిల్లా స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచేలా కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు పి.హరి, టి.కమలహాసన్‌ను ప్రిన్సిపల్ అభినందించారు.

యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు సాయికుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ సదస్సు పార్వతీపురం వైకేయం కాలనీలో ఉన్న జిల్లా సమాఖ్య భవనంలో ఐదు రోజుల పాటు జరిగాయి. స్టార్ట్ యువర్ బిజినెస్ (ఎస్‌వైబి)పై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమం సందర్భంగా సాయి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. యువత ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కోరారు. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అనేక రాయితీలను కల్పిస్తుందని చెప్పారు. పారిశ్రామిక వేత్తలుగా అనేక మంది యువతీ యువకులకు ఉద్యోగ కల్పన చేయవచ్చని అందులో ఎంతో సంతృప్తి కలుగుతుందని ఆయన సూచించారు. ఒక క్రమశిక్షణ గల యాజమానిగా పరిశ్రమలను చక్కగా నిర్వహించవచ్చని అన్నారు. పరిశ్రమ స్థాపనకు ముందు ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేయడంలో మెలకువలు పాటించి అందిపుచ్చుకోవాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఐపిఒ రమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ పరిశ్రమలకు కల్పిస్తున్న రాయితీలు, బ్యాంకు రుణాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది ఎం. కంచిబాబు, నాయుడు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

గ్రామాలలో ప్రశాంత వాతావరణం కల్పించి ప్రజలు శాంతయుతంగా జీవించే విధంగా అందరూ కృషి చేయాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు అన్నారు. మరిపల్లిలో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన సంఘటనకు గల కారణాలను శనివారం బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సిధరపు అప్పారావు మాట్లాడుతూ గిరిజన మహిళ ప్రజా ప్రతినిధిని వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామంలో కొందరు వ్యక్తులు కొట్టడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. మహిళలతో ఇలా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. దాడి చేసిన వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ పేరుతో నిర్లక్ష్యం చేయడం సరికాదని బాధిత కుటుం బానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యద ర్శులు వంతల సుందర్రావు, గేమ్మల జానకిరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తాడంగి గాసి, జన్ని ఈశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలితో మాట్లాడుతున్న నాయకులు

పేరుకుపోయిన చెత్త తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్వచ్ఛత హి సేవ అంటే ఇదేనా? శనివారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి మేజర్ పంచాయతీ ఇఒ ఎం.రవి స్పందించి తెలగ- గాసి వీధిలో ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్తను మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగించారు. దీంతో ఈ ప్రాంత వాసులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

వైద్యారోగ్యశాఖ నిబంధనలను ప్రైవేటు ఆసుపత్రులు ఖచ్చితంగా అమలు చేయాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన డిపిఎంఒ డాక్టర్ రఘుకుమార్, వైద్య బృందంతో కలిసి పట్టణంలో శుభం డయాబెటిక్, స్పెషాలిటీ కేర్, శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ డెంటల్ కేర్ ఆసుపత్రులను శనివారం తనిఖీలు చేశారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ తేదీలు, అర్హత ధ్రువపత్రాలు సంబంధిత రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో ఉండాల్సిన వైద్య పరికరాలు, పరీక్ష కిట్లు నాణ్యత, పనితీరు పరిశీలించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ పక్కగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఉపయోగించిన సూదులు, సెలైన్, కాటన్ తదితర వ్యర్థాలను నిర్దేశించిన మాద్యమాల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఫైర్ సేఫ్టీ నిర్వహణ, రోగుల మరుగుదొడ్ల శుభ్రత, నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. శుభం స్పెషాలిటీ కేర్‌లో వైద్య పరీక్షల ఫీజు వివరాల జాబితాను ప్రదర్శించకపోవడం, నిర్దేశించిన బోర్డు, ల్యాబ్‌కు సంబంధించిన కొన్ని ధ్రువపత్రాల వివరాలపై ఆరా తీసి నిర్ణీత గడువులో పునరుద్ధరించాలని ఆదేశించారు. రోగుల ఆరోగ్య తనిఖీల, వైద్య పరీక్షల వివరాలు రికార్డులో స్పష్టంగా ఉండాలన్నారు. ఆరోగ్య సూచనలు, సలహాలు తెలియజేసే గోడ పత్రికలు ఉండాలన్నారు. వారి వెంట డెమో యోగేశ్వరరెడ్డి, ఈఓ సత్తిబాబు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ టి. జగన్మోహనరావు